# పాలమూరు విషాదానికి తెరపడేదెన్నడు?

– ఎం. రాఘవాచారి



తరాలకు తరాలు వెనుకబడిపోయే దుస్థితిని మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఇంకెంతకాలం అనుభవించాలి? సమైక్య రాష్ట్రం ముసుగులో సాగుతోన్న 'నీటి తరలింపు' స్వార్థ రాజకీయానికి అంతమెప్పుడు?

నిర్మొహమాటంగా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ ఒక నాటకం. తెలుగువారి సమైక్యరాజ్యంగా ఆవిర్భవించిన ఈ రాష్ట్రం గత ఐదు దశాబ్దాలుగా పరిపాలింపబడుతున్న తీరును గమనించి నప్పుడు తెలంగాణ ప్రజలు ఇంతకంటే మరో అభిప్రాయాన్ని ఎలా వ్యక్తం చేయగలరు? ఈ నాటకంలో ఒక అంతర్నాటకం 'నీటి తరలింపు'. ఇదెంత విషాద భరితమో పాలమూరు జిల్లాను పలకరిస్తే తెలుస్తుంది. 1947లో వలసపాలన ముగింపు, 1953లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు– రెండూ మునుముందు తెలం గాణను కలిపేసుకుని విశాలాంధ్ర లేదా ఆంధ్రప్రదేశ్ నాటకానికి తెరతీయడానికి ముందస్తు సందర్భాలు. నీళ్ళతో నేర్చుకున్న రాజ కీయాలు నీళ్ళ మీదనే ప్రయోగించబూనుకున్న ఒక గొప్ప విషాద నాటకానికి తెరతీసిన సందర్భాలు.

నీటి తరలింపు అంతర్నాటకంలోని తొలి అంకం నాగార్జున సాగర్–సిద్దేశ్వరం ప్రాజెక్టులను నిర్మించాలనే నినాదంతో మొదలైం ది. నిధుల సమస్య సాకుగా సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పక్కకు పోయి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణమైంది. 1957 నాటికి నిర్మాణం పూర్తయిన ప్రకాశం బ్యారేజి కృష్ణా డెల్టాలో రెండు పంట ల నీటికి ఆధారమైంది. కర్నూలు పట్టణం మునిగిపోతుందనే మిష తో సిద్దేశ్వరం దగ్గర సోమశిల– సిద్దేశ్వరం గ్రామాలమధ్య నిర్మా ణం కావలసివుండిన సిద్దేశ్వరం ప్రాజెక్టు శ్రీశైలం దగ్గర నిర్మాణ మైంది. కృష్ణా డెల్టా ప్రయోజనాలను కాపాడటానికై శ్రీశైలం ప్రాజె క్టును తొలుత జల విద్యుత్ ప్రాజెక్టుగా ఉద్దేశించారు. అయితే

రాయలసీమ, తెలంగాణ ప్రజల ఒత్తిడితో బహుళార్థ సాధక ప్రాజె క్టుగా ప్రకటించారు.

పోతులపాడు నుంచి కుడికాలువను, టన్నెల్ తవ్వించి ఎడమ కాలువను నిర్మాణం చేస్తామని ఆనాటి పాలకులు చెప్పారు. టన్నెల్ పనులు మాటలలో కూడా లేవు! చెన్నైనగరానికి తాగునీరు నందించడానికై తెలుగు గంగ ప్రాజెక్టును చేపట్టారు. దీని ద్వారా 4000 క్యూసెక్కుల నీరు ఆ మహానగరానికి తరలిస్తా మని తొలుత చెప్పినప్పటికీ 12 వేల క్యూసెక్కుల నీరు తరలించేం దుకు అనువుగా పనులు పూర్తిచేశారు. తెలుగు గంగ కాలువ పొడ వునా కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలో అనేక ప్రాజెక్టులు నిర్మిం చారు. తవ్వకాలు జరిపిన శ్రీశైలం ఎడమ కాలువను సాగర్ మూడ వ కాలవగా మార్చి ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకంగా చేసి గ్రావిటీ పద్ధతిలో నీరు దొరికే స్థితిని దెబ్బతీశారు.

ఎక్కువ పరీవాహక ప్రాంతము, మరే జిల్లాకంటే అత్యధిక సాగు యోగ్యమైన భూములు ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా అప్పటికీ ఇప్పటికీ బీడుపడిపోయి ఉంది.ఈ విషయమై బచావత్ ట్రిబ్యు నల్ సైతం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కారణం వల్లనైతేనేమి, మరే కారణం వల్లనైతేనేమి 1981లో మహబూబ్‌నగర్ జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీటి వసతి కల్పించేందుకై జూరాల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. 29 టిఎంసిలుగా నిర్ణయించిన ప్రాజె క్టు స్థాయిని తొలుత 17కు, ఈ తరువాత 10 టిఎంసిలకు తగ్గించా రు. ప్రస్తుతం జూరాల జలాశయంలో 6 టిఎంసిల నీరు మాత్రమే ఉంటుంది. నిర్మాణంప్రారంభమై పాతికేళ్ళు దాటినా ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తికాలేదు. కాలవల సంగతి సరేసరి. తత్ఫలితంగా కృష్ణా ప్రవాహంలో తరలివచ్చే ఇసుకను కంట్రోల్ చేసే ఒక నిర్మా ణంగా మాత్రమే జూరాలప్రాజెక్టు మిగిలిపోయింది. మహబూబ్ నగర్ జిల్లా ప్రజల కడగండ్లు తీర్చడంలో పాలకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా జూరాలను బాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి. ఇలా చేయడం వలన కనీసం ఐదు లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కలుగుతుంది. ఎందుకు చేయరీ పని? కృ ష్ణా జలా లను తాముమాత్రమే ఉపయోగించుకోవాలని కృష్ణాడెల్టాతో పాటు కర్నూలు, కడప జిల్లాల నాయకత్వాలు ఎత్తులు మీద ఎత్తులు వేస్తున్నారు. పులిచింతలను ఒకరు తలకెత్తుకుం

సిద్దేశ్వరం ప్రాజె క్టును మరొకరు తలకెత్తుకుంటున్నారు. ఇరు ప్రాంతాల ఆకాంక్షల ను తీర్చడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. అయితే మహబూబ్ నగర్ నల్లగొండ జిల్లాల ప్రజలకు కనీస సహాయం చేయడానికి కూడా ఏ ప్రభుత్వమూ శ్రద్ధ చూపడం లేదు.

రాజోలిబండ పథకాన్ని ఆధునీకరించి 87,500 ఎకరాలకు నీరు పారించే చర్యలు చేపట్టాలనే ఆందోళనను గత పది సంవత్సరా లుగా నీరుగారుస్తూ సుంకేశుల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1350 కోట్ల రూపాయలు వ్యయం చేసి తుంగభద్ర నదినే కర్నూలు, కడప జిల్లాల వైపు మలిపారు. ఇక్కడితో ఆగని రాయలసీమ నాయకులు సిద్దేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. సోమశిల -సిద్దేశ్వరం గ్రామాల మధ్య 100 టిఎంసిల నీటిని నిలువ చేయ గల ప్రాజెక్టు నొకదాన్ని నిర్మించి, దాని ద్వారా నీటిని తరలించి, గ్రావిటీ పద్ధతిలోనే రాయలసీమ జలాశయాలన్నిటినీ నింపాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈప్రతిపాదనను ఆమోదించనున్నదని, ఈ ప్రాజెక్టుతో పాటు కొల్లాపూర్ నుంచి కర్నూలుకు వంతెన కూడా నిర్మాణమవుతుందని తెలుస్తోంది. అంతేకాక ఈప్రతిపాదనకు మరో ముందడుగుగా ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్టులో 834 అడుగు ల కనీస నీటి మట్టపు స్థాయిని 854 అడుగులకు పెంచుతూ జీ వో జారీ చేసింది. గత నెల 13న పోతులపాడు హెడ్ రెగ్యులేటర్ నుం చి 12 వేల క్యూసెక్కులకు బదులుగా 40 వేల క్యూసెక్కులు తర లించడానికి అనుగుణంగా 1250 కోట్ల రూపాయల నిధులతో కాలువలను విస్తరించాలని మరో జీవో జారీ చేసింది. తీరాంధ్రానికి కాకుంటే రాయలసీమకు ఇంత దన్నుగా నిలబడ్డ ముఖ్యమంత్రి మహబూబ్‌నగర్ ప్రజలగోడును ఎందుకు అర్థం చేసుకోరు? రాష్ట్రా న్ని ఏ పార్టీ పాలించినా గత ఐదు దశాబ్దాలుగా నడుస్తోన్న చరిత్ర ఇదే.

శతాబ్దంన్నర చరిత్ర గల కృష్ణా డెల్టాకు నీరందక పోతే ఏటా పదివేల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోవలసివస్తుంది కనుక పులిచింతల ప్రాజెక్టును నిర్మించాలని, అంతే చరిత్ర గల కర్నూలు- కడప కాలవ ఆయకట్టు ఇకముందు కూడా పచ్చగా ఉండాలంటే సిద్దేశ్వరం ప్రాజెక్టును కట్టాలనే వాదనలతో బలాన్ని, బలగాన్ని, మీడియాను ఉపయోగిస్తున్న

నాయకులకు, పాలకులకు వెనుకబ డిన ప్రాంతాలుప్రత్యేకించి మహబూబ్‌నగర్ జిల్లా శ్రేయస్సు పట్ల కించిత్ శ్రద్ధ అయినా ఉందా? ఉంటే భీమా ప్రాజెక్టు నిర్మాణం అసాధ్యమయ్యేదేనా? నిజాం నవాబు హయాంలో ప్రతిపాదింప బడిన భీమా ప్రాజెక్టుకు భాషా ప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు విఘాత మయిందని అప్పుడు, కర్ణాటక భూములు ముంపునకు గురవుతా యి కనుక ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించదని ఇప్పుడు పాలకులు చెబుతున్నారు. అయితే భీమా విషయమై కర్ణాటకతో ఒక్కసారైనా చర్చించడం జరిగిందా? కర్ణాటకకు అభ్యంతరాలుంటే దానిని జాతీ య ప్రాజెక్టుగా చేపట్టవచ్చు కదా. 1956 దరిమిలా దేశంలో ఎన్నో అంతరాష్ట్ర జల వివాదాలు పరిష్కారమయ్యాయి. మరి భీమా ప్రాజెక్టుపై వివాదం అంతగా పరిష్కారానికి లొంగనిదా? భీమా ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా సంపద ఉత్పత్తితో సహా అన్ని విషయాలలోను కృష్ణా, గుంటూరు జిల్లా లతో పోటీ పడేది. శ్రీశైలం, సుంకేశుల తదితర ప్రాజెక్టుల కోసం సర్వస్వాన్ని కోల్పోయి నిత్యనిర్వాసితులుగా, కూలీలుగా అడ్డాల మీద బతుకుతున్న మహబూబ్‌నగర్ జిల్లాప్రజలు అనుభవిస్తోన్న దుస్థితి, ఇతర ప్రాంతాల ప్రజలకు సాగునీటి, రహదారుల సదుపా యాల కల్పనకు తోడ్పడినందుకే సుమా!

ఈ శోచనీయ కాదు గర్హనీయ స్థితికి ఎవరు బాధ్యత వహిం చాలి? ప్రభుత్వాల మెడలు వంచి కృష్ణా జలాలను తమ ప్రాంతాల కు తరలించుకుపోతోన్న కృష్ణా డెల్టా, కర్నూలు, కడప జిల్లాల నాయకులా? లేక పదవుల కోసం మాత్రమే పాకులాడుతున్న జిల్లా నాయకులా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలా? ఇంత సున్నితమైన, ప్రత్యేకమైన సమస్యను పరిష్కరించే పట్టుదల ఎవరిలోనూ కనిపిం చడం లేదు. సమైక్యరాష్ట్ర నిర్మాణంలో ముందు పీటీలో నిలిచిన ఉభయ కమ్యూనిస్టు (సిపిఐ, సిపిఎం) పార్టీల నాయకులకు, ఎంత కూ తీరాంధ్రం, రాయలసీమ ప్రయోజనాలను కాపాడే కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు, వాటి ప్రభుత్వాలకు దన్నుగా నిలవటం, అందుకనువైన సిద్ధాంతాలు వల్లించడం తప్ప, మరొకటి చేతనైన దాఖ లాలేదు. మన రాష్ట్రంలోని అంతర్గత జల వివాదాలను న్యాయంగా పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర ప్రభుత్వానికి లేనే లేదు.

మహబూ బ్‌నగర్ జిల్లాలోని పరిస్థితులను హింసా ప్రతిహింసల వలయంలో మాత్రమే చూడగలుగుతున్న మావోయిస్టుల దృష్టిలో ఈ సమస్య కు ప్రాధాన్యమే ఉన్నట్టు కనిపించదు. ఒకటి కాదు, రెండు కాదు, దశాబ్దాలకు దశాబ్దాలు, తరాలకు తరాలు వెనుకబడిపోయే దుస్థితిని మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు శాశ్వతంగా అనుభవించవల సిందేనా? సమైక్య రాష్ట్రం ముసుగులో సాగుతున్న స్వార్థ రాజకీ యానికి సజీవ సాక్ష్యమైన 'నీటి తరలింపు' అంతర్నాటకంలో – ఆకలి చావుకు, ఆత్మహత్యకు, వలసకు, వలస చావుకు బలవుతున్న రైతు పాత్రలో మహబూబ్‌నగర్ రైతులు నిత్యమూ కనిపించవల సిందేనా? సొంతగడ్డపై తమకు తామే పరాయివారై, తమ వనరు లన్నీ చేజారి పోతుంటే నిశ్చేష్టులుగా మిగిలిపోవలసిందేనా? ఇవి నేను మాత్రమే వేస్తున్న ప్రశ్నలు కావు సుమా. పాతికేళ్ళు గడిచినా జూరాలప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి నోచు కోక, వేల టిఎంసిల నీరు దిగువకు తరలింపబడుతుంటే, కురిసి కురిసి తెల్లబడి తమ గడ్డకు వచ్చిన మబ్బుల వంక, నురుగులు కక్కుతూ పారుతున్నకృష్ణమ్మ వంక, గర్భజలం ఇంకి వట్టిపోయిన భూముల వంక చూసి గుండె లు బాదుకుంటూ లక్షలాది రైతులు చేస్తోన్న ఆక్రోశమే ఈ ప్రశ్నలు. మహబూబ్‌నగర్ రైతుకు భీమా ప్రాజెక్టు కావాలి. అది వారి జన్మ హక్కు. కనుక 'భీమా'ను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించికేంద్ర ప్రభుత్వమే దానిని నిర్మించాలి.